జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

బుధవారం | 4-3-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 607 పేజీలు: 4 వెల : రూ.7

# కొత్తూరు కూటమికి.. బీటలు

* మండలంలో జోరుగా జనసేన సభ్యత్వ నమోదు * టీడీపీ నుంచి జనసేనలోకి పలువురు చేరిక * అసంతృప్తితోనే టీడీపీని వీడి జనసేనలోకి * కొత్తూరు మండలంలో మారుతున్న రాజకీయ సమీకరణాలు * ఏదో తేడా కొడుతుందన్నంటున్న రాజకీయ విశ్లేషకులు






కొత్తూరు, మార్చి3 (వార్త): పాతపట్నం నియోజకవర్గ పరిధిలోని కొత్తూరు మండల రాజకీయాలు ఇప్పుడు అత్యంత ఆసక్తికరమైన మలుపులు తిరుగుతున్నాయి. గత ఎన్నికల సమయంలో అఖండ విజయం సాధించడమే లక్ష్యంగా ఒక్కటైన కూటమి పార్టీల మధ్య ఇప్పుడు స్పష్టమైన చీలికలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో మునుపెన్నడూ లేనంతగా అసంతృప్తి గూడు కట్టుకుంది. 2024 ఎన్నికల వేళ ప్రస్తుత ఎమ్మెల్యే మామిడి గోవిందరావు విజయం కోసం అహోరాత్రులు శ్రమించిన కీలక నాయకులు, ద్వితీయ శ్రేణి కార్యకర్తలు ఇప్పుడు పార్టీ కార్యక్రమాలకు పూర్తిగా దూరంగా ఉంటుండటం చర్చనీయాంశంగా మారింది. ఆనాడు పార్టీయే ప్రాణంగా భావించి 'మామిడి' వెంట నడిచిన వారు, ఇప్పుడు కనీసం కార్యాలయాల వైపు కూడా చూడకపోవడం గమనార్హం. ఈ అసంతృప్తికి ప్రధాన కారణం పార్టీలో తమకు దక్కాల్సిన కనీస గుర్తింపు, ప్రాధాన్యత కరువవ్వడమేనని క్షేత్రస్థాయిలో వినిపిస్తోంది. కష్టకాలంలో జెండా మోసిన వారిని కాదని, కొత్తగా వచ్చిన వారికి ప్రాముఖ్యత ఇస్తున్నారనే ఆగ్రహంతో పలువురు నాయకులు ఇప్పుడు జనసేన పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారు. కూటమిలో భాగంగా ఉన్నప్పటికీ, టీడీపీలోని అంతర్గత లోపాలను సాకుగా చూపిస్తూ జనసేనలోకి వలసలు వెళ్లేందుకు నేతలు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. మరో ఆసక్తికరమైన పరిణామం ఏమిటంటే, ప్రస్తుత కొత్త నాయకత్వ తీరు నచ్చక కొందరు పాత నాయకత్వం వైపు మళ్ళీ అడుగులు వేస్తుండటం స్థానిక టీడీపీలో కలకలం రేపుతోంది. ప్రభుత్వ హయాంలో కేవలం రెండేళ్ల కాలంలోనే ఈ స్థాయిలో వ్యతిరేకత రావడం రాజకీయ విశ్లేషకులను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. మరోవైపు, అధికార పక్షంలోని ఈ అంతర్గత కలహాలను తనకు అనుకూలంగా మార్చుకునేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిశ్శబ్దంగా వ్యూహాలు రచిస్తోంది. పాతపట్నం నియోజకవర్గంలో చాపకింద నీరులా వైసీపీ తన బలాన్ని పెంచుకుంటోంది. కూటమిలో తలెత్తిన ఈ చీలికలు తమకు రాజకీయంగా పెద్ద ఎత్తున మేలు చేస్తాయని భావిస్తున్న వైసీపీ నాయకత్వం, గ్రూపు తగాదాలతో విసిగిపోయిన కేడర్‌ను తమ వైపు తిప్పుకునే పనిలో పడింది. ఇదే పరిస్థితి కొనసాగితే 2029 ఎన్నికల నాటికి కూటమిలో సీటు కేటాయింపులు మారే అవకాశాలు మెండుగా ఉన్నాయి. బలపడుతున్న జనసేన లేదా పుంజుకుంటున్న వైసీపీ వల్ల ప్రస్తుత రాజకీయ చిత్రం పూర్తిగా తారుమారయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. నాయకత్వం తక్షణమే మేల్కొని దిద్దుబాటు చర్యలు చేపట్టకపోతే, కొత్తూరు గడ్డపై కూటమికి గడ్డుకాలం తప్పదని రాజకీయ పరిశీలకులు హెచ్చరిస్తున్నారు.






## ట్యాంకర్ నుంచి గ్యాస్ లీకేజీ

* తిలారు రైల్వే స్టేషన్‌లో గూడ్స్ నిలిపివేత * అప్రమత్తమైన అధికారులు * తక్షణ చర్యలు * తప్పిన పెను ప్రమాదం

జలుమూరు, మార్చి 3 (వార్త): ఎల్‌పీజీ గ్యాస్‌తో విశాఖపట్నం నుంచి ఖుర్దాకు వెళ్తున్న గూడ్స్ రైలులో ఓ ట్యాంకరు నుంచి గ్యాస్ లీకవుతున్నట్టు రైల్వే అధికారులు గుర్తించారు. వెంటనే అప్రమత్తమై తిలారు రైల్వే స్టేషన్ సమీపంలో నిలిపివేయించారు. నరసన్నపేట, కోటబొమ్మాళి, శ్రీకాకుళం నుంచి అగ్నిమాపక శకటాలు అక్కడకు చేరుకున్నాయి. పోలీస్, అగ్నిమాపక, రైల్వేశాఖ అధికారులు లీకవుతున్న ట్యాంకర్ నుంచి మిగతా వాటిని విడదీశారు. ఆ తర్వాత గ్యాస్ లీక్‌ను సిబ్బంది అరికట్టారు. ఆ తర్వాత గూడ్స్ రైలు పరుగులు పెట్టింది. పెద్ద ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## ఆలయాలు మూసివేత

* ఉదయం ప్రత్యేక పూజల అనంతరం మూసివేసిన అర్చకులు * గ్రహణం వీడిన తర్వాత సంప్రోక్షణ

అరసవల్లి/జలుమూరు, మార్చి 3 (వార్త): చంద్రగ్రహణం సందర్భంగా మంగళవారం జిల్లాలోని పలు ఆలయాలు మూతపడ్డాయి. అరసవల్లిలో సూర్య నారాయణస్వామి దేవస్థానంలో ఆలయ అర్చకులు ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 9.30 గంటలకు ఆలయాన్ని మూసివేశారు. గ్రహణానంతరం రాత్రివేళ ఆలయాల్లో శుద్ధి, సంప్రోక్షణ నిర్వహించారు. బుధవారం ఉదయం స్వామికి నిత్యార్చనలు అనంతరం భక్తులకు స్వామి వారి దర్శనం కల్పిస్తామని ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ తెలిపారు. అలాగే జలుమూరు మండలం శ్రీముఖలింగంలో కొలువై ఉన్న శ్రీముఖలింగేశ్వర ఆలయాన్ని మంగళవారం ఉదయం మూసివేశారు. గ్రహణ శూలం ఉన్న కారణంగా ఉదయం 9 గంటలకు ఆలయాన్ని మూసివేసినట్లు కార్యనిర్వహణ అధికారి కె. ఏడుకొండలు తెలిపారు. గ్రహణం అనంతరం రాత్రి 7.30 గంటలకు ఆలయ ద్వారాలను తిరిగి తెరిచి, ఆలయ శుద్ధి కార్యక్రమాలు, సంప్రోక్షణ నిర్వహించారు. అనంతరం కామదహనం కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. బుధవారం ఉదయం నుంచి నిత్యారాధనలు, ఇతర కైంకర్యాలు నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించనున్నట్లు అధికారులు వెల్లడించారు.







## అతిసార కట్టడికి పారిశుధ్య సమరం

* క్షేత్రస్థాయిలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ మెరుపు తనిఖీలు * కాజీపేట తదితర వీధుల్లో పారిశుధ్య పనుల పర్యవేక్షణ * ఒక్కరోజే 186 టన్నుల వ్యర్థాల తొలగింపు

శ్రీకాకుళం, మార్చి 3(వార్త): నగరంలో డయేరియా పరిస్థితుల నేపథ్యంలో ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా పారిశుధ్య పనులను జిల్లా యంత్రాంగం ముమ్మరం చేసింది. జాయింట్ కలెక్టర్, నగరపాలక సంస్థ ఇన్చార్జి కమిషనర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ మంగళవారం శ్రీకాకుళం నగరంలోని పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సెవెన్ రోడ్ జంక్షన్ లోని అన్నా క్యాంటీన్ ను సందర్శించిన ఆయన, అక్కడ పారిశుధ్య నిర్వహణను స్వయంగా పరిశీలించారు. అనంతరం కాజీపేటతో పాటు నగరపాలక సంస్థలోని పలు వార్డుల్లో పర్యటించి, క్షేత్ర స్థాయిలో జరుగుతున్న పనులపై సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. పారిశుధ్య పనుల కోసం మంగళవారం ఒక్కరోజే మొత్తం 17 జేసీబీలు, 24 ట్రాక్టర్లను రంగంలోకి దించారు. 84 ట్రిప్పుల ద్వారా మొత్తం 147 టన్నుల పూడిక, 39.25 టన్నుల చెత్తను కలిపి మొత్తం 186.25 టన్నుల వ్యర్థాలను నగర వెలుపలికి తరలించారు. సుమారు 3.89 కిలోమీటర్ల మేర కాలువల్లో పూడికను తొలగించి నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చేశారు. నగరంలోని 57,082 గృహాలకు గాను, 49,912 ఇళ్ల నుంచి (87.43 శాతం) చెత్తను సేకరించారు. దీని ద్వారా సుమారు 30,496 కిలోల వ్యర్థాలు సేకరించినట్లు అధికారులు తెలిపారు. పారిశుధ్యంపై రాజీ పడే ప్రసక్తే లేదని ఇన్చార్జి కమిషనర్ స్పష్టం చేశారు. పారిశుధ్య పనుల్లో ఎటువంటి అలసత్వం వహించినా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు.



## శ్రీకాకుళం నుంచి సికింద్రాబాద్, తిరుపతికి రైళ్లు కేటాయించండి

* రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరిన కేంద్రమంత్రి రామ్మోహన్

శ్రీకాకుళం, మార్చి3(వార్త): సౌత్ కోస్ట్ రైల్వే జోన్ పనులు మరింత వేగవంతం చెయ్యాలని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కోరారు. శ్రీకాకుళం జిల్లాలో పలు కీలక ప్రాజెక్టులతో పాటు ఆంధ్రప్రదేశ్ లో వివిధ సర్వీసులకు సంబంధించి ఈ సందర్భంగా కీలకంగా చర్చించారు. మంగళవారం న్యూఢిల్లీలోని రైల్ భవన్‌ను సందర్శించిన రామ్మోహన్ నాయుడు.. రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో కలసి.. రైల్వే ఆపరేషన్ కంట్రోల్ రూమ్ ఆపరేషన్ ను పరిశీలించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ కు చెందిన కీలక ప్రాజెక్టుల పురోగతికి సంబంధించి ఈ భేటీలో కీలక చర్చ జరిగింది. విశాఖపట్నం కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఆపరేషనల్ పనులను మరింత వేగవంతం చెయ్యాలని ఈ సందర్భంగా అశ్విని వైష్ణవ్ ను రామ్మోహన్ నాయుడు కోరారు. ప్రస్తుత స్థితిని కూడా అశ్విని వైష్ణవ్ వివరించారు. అదేవిధంగా శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి కూడా పలు రైళ్లకు, రైల్వే స్టేషన్ల కు సంబంధించి కీలక చర్చలు జరిగాయి. శ్రీకాకుళం నుండి విజయనగరం మీదుగా సికింద్రాబాద్ చేరేవిధంగా నూతన సర్వీసును ఏర్పాటు చెయ్యాలని ప్రధానంగా రామ్మోహన్ నాయుడు కోరారు. శ్రీకాకుళం నుండి సికింద్రాబాద్ , తిరుపతికి నేరుగా నూతన సర్వీసుల ఏర్పాటు, మందస రోడ్, పాతపట్నం, హరిశ్చంద్రపురం స్టేషన్లలో కీలక రైళ్లకు సంబంధించి హాల్టుల ఏర్పాటు, కామేశ్వరిపేట హాల్ట్ స్టేషన్ అభివృద్ధి గురించి ప్రధానంగా చర్చించారు. ఇందులో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న హరిశ్చంద్రపురం స్టేషన్‌ను లాజిస్టిక్స్ హబ్‌గా అప్‌గ్రేడ్ చేయడంపై దృష్టి సారించాలని కోరారు. శ్రీకాకుళం జిల్లాలో కొత్త రైల్వే ఓవర్ బ్రిడ్జిలు, రైల్వే అండర్ బ్రిడ్జిల ఏర్పాటు గురించి పలు ప్రాజెక్టులను రైల్వే మంత్రికి వివరించారు. కంట్రోల్ రూమ్ విభాగాన్ని సందర్శించే సమయంలో కొత్తవలస పలాస సెక్షన్ల మధ్య ట్రైన్ ఆపరేషన్ల వివరాలను రామ్మోహన్ నాయుడుకు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ మరింత విపులంగా వివరించారు. గుజరాత్‌లో నూతనంగా నిర్మితం అవుతున్న దోహలేరా గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయంకు రైల్వే లాజిస్టిక్ రవాణాను అనుసంధానం చెయ్యడం పై కూడా ఈ భేటీలో ప్రధానంగా చర్చించారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో నిర్మితమవుతున్న విజయవాడ విమానాశ్రయ టెర్మినల్, భోగాపురం గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయాల నిర్మాణ పనులపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఢిల్లీలోని తన కార్యాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. పౌర విమానయాన మంత్రిత్వ శాఖ, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులతో పాటు, ఈ రెండు ముఖ్య ప్రాజెక్టుల నిర్మాణం చేపడుతున్న సంస్థ ప్రతినిధులతో సమీక్షించారు.



## ఎమ్మెల్యే అశోక్ దృష్టికి లాలాపేట రోడ్డు సమస్య

**ఇచ్ఛాపురం, మార్చి 3(వార్త):** అసెంబ్లీ ఆవరణలో ఇచ్ఛాపుర నియోజకవర్గం ఎమ్మెల్యే విప్ బెందాళం అశోక్‌బాబు దృష్టికి 17వ వార్డు తెలుగుదేశం ఇన్‌చార్జి జన్నెల సంతోష్ యాదవ్ ఇచ్ఛాపురం మున్సిపాలిటీ 17వ వార్డులో గల లాలాపేట ఫరీద్ ఇంటి దగ్గర నుంచి సూర్యం మాస్టారు ఇంటి వైపు గల రోడ్డు గురించి వివరించారు. ఆ రోడ్డులో నివసిస్తున్న ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, వర్షాకాలం వస్తే అసలు నడవడానికి కూడా వీలు లేకుండా ఉందని, బైకుల మీద నుంచి పడిపోతున్నారని ఎమ్మెల్యేకి ఆయన వివరించారు. దీనిపై అశోక్ ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి. అతి త్వరలో ఆ రోడ్డు వేస్తామని హామీ ఇచ్చారని సంతోష్ తెలిపారు.



# కొత్త పింఛన్ల హామీ గాలికేనా?

### - అర్హుల ఎదురుచూపులు ఇంకెన్నాళ్లు...?
### -ప్రభుత్వంపై మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆగ్రహం

**కొత్తూరు, మార్చి 3 (వార్త):** రాష్ట్రంలో కొత్త పింఛన్ల మంజూరుపై కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును వైఎస్ఆర్సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి తీవ్రంగా విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, 20 నెలలు గడుస్తున్నా కొత్త పింఛన్ల ఊసెత్తకపోవడం దారుణమని ఆమె మండిపడ్డారు. గతేడాది అక్టోబర్ 1వ తేదీ నుంచే కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించినప్పటికీ, నేటికీ ఆచరణలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని ఆమె ఆరోపించారు. కనీసం దరఖాస్తులు స్వీకరించడానికి వెబ్ సైట్ కూడా తెరవకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని, దీంతో పాతపట్నం, మెళియాపుట్టి, కొత్తూరు, హిరమండలం, ఎల్.ఎన్.పేట మండలాల్లోని వేలాది మంది అర్హులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త పింఛన్ల కోసం వితంతువులు, దివ్యాంగులు, వృద్ధులు ప్రతిరోజూ సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారని, అయితే ప్రభుత్వం నుంచి ఎటువంటి సమాచారం లేదని సిబ్బంది చేతులెత్తేస్తున్నారని రెడ్డి శాంతి పేర్కొన్నారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో రాజకీయాలతో సంబంధం లేకుండా వలంటీర్లు నేరుగా లబ్ధిదారుల ఇంటికే వచ్చి దరఖాస్తులు పూర్తి చేసేవారని, అర్హత ఉంటే చాలు నిరంతర ప్రక్రియగా పింఛన్లు మంజూరయ్యేవని ఆమె గుర్తు చేశారు. కానీ నేడు వెబ్ సైట్ పూర్తిగా నిలిపివేయడంతో కొత్తగా దరఖాస్తు చేసుకునే వారు కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా ఫలితం లేకుండా పోయిందని ధ్వజమెత్తారు. ముఖ్యంగా మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛన్లు ఇస్తామని ఎన్నికల ముందు కూటమి నాయకులు పెద్ద ఎత్తున హామీలు ఇచ్చారని, అయితే ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోనూ దీని కోసం ఎటువంటి నిధులు కేటాయించకపోవడం వారి నైజాన్ని తెలియజేస్తోందని విమర్శించారు. హామీలను గాలికొదిలేసి ప్రజలను వంచిస్తున్నారని, అర్హులైన లబ్ధిదారుల ఆవేదనను ప్రభుత్వం పట్టించుకోకపోతే ప్రజల పక్షాన పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ఆమె హెచ్చరించారు. తక్షణమే వెబ్‌సైట్ ఓపెన్ చేసి కొత్త పింఛన్ల ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేశారు.




## అలేఖ్ స్వామి మహా యజ్ఞంలో అలరించిన నృత్యాలు




**ఇచ్ఛాపురం, మార్చి 3(వార్త):** వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ చిన్నారుల అద్భుత నృత్య ప్రదర్శన ఒడిస్సా బోనసాల గ్రామంలో మహిమ అలేఖ్ స్వామివారి యజ్ఞంలో జరిగిన కూచిపూడి భరతనాట్యం ఒరియా సంబల్పురి జానపద గీతాలు సినీ రీమిక్స్ పాటలు వీనులకు విందుగా చిన్నారులు నాట్యాన్ని అందించారు. నాట్య గురువు శృతి పట్నాయక్ అకాడమీ అధ్యక్షులు చిన్నా గురుస్వామి నాట్య గురువులు దట్టి కావ్య కొరివి జాగృతి వారి ఆధ్వర్యంలో సుమారు 30 మంది పిల్లలు ఈ నాట్యంలో పాల్గొని మహాగణపతి. అదివో అల్లదివో. జీయర్ జీయర్. ఓం శక్తి.. డమరుక నాట్యం. సీతారామ చరితం మహా ప్రాణదీపం నాంపల్లి నుండి మల్లేపల్లి. దండాలు దండాలు దండాలమ్మ. దండ దండ దండాలు ధనేశ్వరి. జైఫుల్లో. ఝుల్లి ఝుల్లి అసూచి. ఏమి పరిమళం సుగంధ పరిమళం. అనే చక్కని పాటలకు చక్కటి హావభావాలతో ప్రేక్షకులను అలరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు గ్రామస్తులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు చివరిగా కళాకారులకు పెద్దల చేతుల మీదుగా సత్కార కార్యక్రమం జరిపించారు.

## అంగన్‌వాడీ యూనియన్ నిరసన



**ఇచ్ఛాపురం, మార్చి 3(వార్త):** అంగన్వాడీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విజయవాడ దర్నాకు వెల్లిన అంగన్వాడీ కార్యకర్తలను నిర్బంధించటం దారుణమని వెంటనే విడిచిపెట్టాలని అంగన్వాడీ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐటీయూ యూనియన్ జిల్లా నాయకులు ఆదేశాల మేరకు మంగళవారం పట్టణంలో నిరసలు చేశారు .తాహశీల్దార్ కార్యాలయం నుండినిరసనలు తెలుపుతూ పాత బస్టాండ్ జంక్షన్ వద్ద రోడ్డుపై సుమారుగా గంట పాటు రోడ్డుపై బైఠాయించి నిరసనలు తెలుపుతూ మానవ హారం చేపట్టారు. అంగన్వాడీల వేతనాలు పెంచాలని, అక్రమంగా నిర్బంధం చేసిన అంగన్వాడీ కార్యకర్తలను విడిచి పెట్టాలని డిమాండ్ చేశారు. పట్టణ, రూరల్ ఎస్సైలు ముకుందరావు, జనార్ధనరావు, పోలీస్ సిబ్బంది అంగన్వాడీ కార్యకర్తలను తరలించే ప్రయత్నం చేశారు. చివరికి అంగన్వాడీలు స్వచ్ఛందంగానే నిరసనలు విరమించారు.

## మృతుల కుటుంబాలకు ఎంపీపీ పరామర్శ



**కంచిలి, మార్చి 3(వార్త):** బురదపాడు గ్రామానికి చెందిన పైల హరికృష్ణ ఆర్ గద్దలపాడు గ్రామానికి చెందిన ఉప్పాడ కుమార్ ఇటీవల అనారోగ్య సమస్యలతో మృతి చెందడంతో ఆయా కుటుంబాలను ఎంపీపీ పైల దేవదాసు రెడ్డి మరి కొంతమంది వైసీపీ నాయకులతో కలిసి మంగళవారం పరామర్శించారు. మృతుల చిత్రపటాల వద్ద నివాళులర్పించి ఆయా కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొనపల సురేష్ పైల మోహనరావు పైల లక్ష్మీనారాయణ గేదెల దాలయ్య రెడ్డి పైల త్రినాథ్ రెడ్డి బుడ్డెపు బైరాగి ఉప్పాడ భీమారావు తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ బలోపేతానికి ఐక్యతతో ముందుకు సాగాలి: కృష్ణ చైతన్య

**సారవకోట, మార్చి 3(వార్త):** సారవకోట మండలంలోని అలుధు గ్రామంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వంశీకృష్ణ అధ్యక్షతన మండల నాయకులతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పోలాకి జెడ్పీటీసీ కృష్ణ చైతన్య మాట్లాడుతూ, పార్టీ అనుబంధ కమిటీ సభ్యులంతా ఐక్యంగా పనిచేసి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతం కోసం ప్రతి నాయకుడు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో సర్పంచులు, ఎంపీటీసీలు, క్లస్టర్ కోఆర్డినేటర్లు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# అబ్బురపరచిన సైన్స్ ప్రాజెక్ట్

### -స్మార్ట్ పార్కింగ్ సిస్టమ్ తయారు
### -విద్యార్థినుల ప్రతిభ

**మందస, మార్చి 3(వార్త):** మహిళలు పురుషులకు ధీటుగా పోటీ పడుతున్నారు. ఆకాశంలో కూడా సగమవుతున్నారు. అన్నిరంగాల్లో మేమున్నామంటూ.. మహిళలు తమ ప్రతిభ చూపుతున్నారు. దీనిలో భాగంగా నలుగురు ఇంజనీరింగ్ విద్యార్థినిలు తమ ప్రతిభను చూపారు. స్మార్ట్ పార్కింగ్ సిస్టంను కోడింగ్ ద్వారా తయారు చేశారు. దీన్ని అభివృద్ధి చేస్తే, ట్రాఫిక్ జాం తగ్గుతుందని, వాహనదారులకు సమయం వృథా తగ్గుతుందని ఆ ఇంజనీరింగ్ విద్యార్థినిలు చెబుతున్నారు. విశాఖపట్నంలో ద్వితీయ సంవత్సరం ఇంజనీరింగ్ చదువుతున్న మందసకు విద్యార్థినితో పాటు ఇతర జిల్లాలకు చెందిన మరో ముగ్గురు విద్యార్థినులు ఈ ప్రాజెక్టు తయారు చేసి, అబ్బురమనిపించారు. వివరాలిలా ఉన్నాయి. హాస్పిటల్స్, షాపింగ్ మాల్స్ వంటి ప్రదేశాల్లో వాహనాలు పార్క్ చేయడానికి వెళ్లినప్పుడు అక్కడ పార్కింగ్ స్లాట్లు ఖాళీగా ఉన్నాయా లేదా అనేది మనకు ముందుగా తెలియదు. దీనివల్ల చాలా సేపు వేచి ఉండాల్సి వస్తుంది. ఇలా వేచి ఉండడం వల్ల ఇంధనం వృథా అవుతుంది. పార్కింగ్ బయట ట్రాఫిక్ జామ్‌లు కూడా ఏర్పడతాయి. ఈ సమస్యలను పరిష్కరించడానికి స్మార్ట్ పార్కింగ్ సిస్టమ్ ప్రాజెక్ట్ ఉపయోగపడుతుంది. మనము ఒక క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే, మన మొబైల్‌లో పార్కింగ్ స్పేస్ ఖాళీగా ఉందా లేదా అనేది కనిపిస్తుంది. ఒకవేళ ఖాళీగా ఉంటే, ఏ స్లాట్లు ఖాళీగా ఉన్నాయి, ఏ స్లాట్లు నిండిపోయాయి అన్న వివరాలు ఒక డ్యాష్‌బోర్డ్ రూపంలో మన మొబైల్‌లో చూపిస్తుంది. ఖాళీగా ఉన్న స్లాట్లు పచ్చ రంగులో(గ్రీన్), నిండిపోయిన స్లాట్లు ఎరుపు రంగులో(రెడ్) చూపబడతాయి. ఈ ప్రోగ్రాంను కోడింగ్ తో రూపొందించారు. దీంతో తమ వాహనాలు ఎక్కడ, ఎలా పార్కింగ్ చేసువచ్చునో సులభంగా వాహనదారులకు తెలిసిపోతుంది. ఈ ప్రాజెక్టును ఇంజనీరింగ్ విద్యార్థినిలు కె.రేష్మ, డి.లావణ్య, బి.యోగిత, జి.నవ్య తయారు చేశారు. కాగా, ఎగ్జిబిషన్ లో ఈ ప్రాజెక్టు బహుమతితో పాటు పలువురి అభినందనలు, ప్రశంసలను అందుకుంది.








# సమస్యలు గిరిగీసుకున్నాయి

### -పాపం.. గిరిజనం..
### -ప్రమాదకరంగా మారిన రహదారి
### -పట్టించుకోని పాలకులు

**మందస, మార్చి 3(వార్త):** పాపం గిరిజనులు.. సమస్యలతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పట్టించుకునే నాథుడు లేకపోవడంతో వారంతా తమ పనులు తామే చేసుకోవడానికి సిద్ధమవుతున్నారు. ఓ ప్రధాన రహదారి అధ్వాన్నంగా, ప్రమాదకరంగా మారిందని గిరిజనులు అధికారులు, పాలకులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. తరుచూ ప్రమాదాలు జరుగుతుండడంతో.. తామే బాగు చేసుకోవడానికి సిద్ధమవుతున్నారు. వివరాలిలా ఉన్నాయి. మందస మండలంలోని బొగాబంద పంచాయతీలోని మహేంద్రతనయ-మెళియాపుట్టి రహదారిలో కిల్లోయిజంక్షన్ నుంచి బంజిరియువరాజపురం మీదుగా పలు గిరిజన గ్రామాలను కలిపే రహదారి ఉంది. ఎప్పటి నుంచో ఈ రహదారి బంజిరియువరాజపురం వద్ద కొయిటాసాయి వెళ్ళే రహదారి శిథిలావస్థకు చేరుకుంది. దీనికి తోడు రహదారికి అడ్డంగా జేసీబీతో కొందరు తవ్వి, నిర్లక్ష్యంగా వదిలేశారు. ఇది చాలా దారుణం. రాకపోకలకు చాలా గిరిజనులు తీరవ ఇబ్బంది పడుతున్నారు. దీంతో ప్రయాణీకులు, గిరిజనులు, గిరిజనసంఘాల నాయకులు ఈ రహదారి బాగు చేయండి మహాప్రభో అని విన్నవించుకున్నారు. కానీ, అధికారుల్లో చలనంలేదు. మందస పట్టణంలోని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం కూడా ఉంది. కానీ, సమస్య పరిష్కారం కాలేదు. ఇటీవల ఈ సమస్య మరింత ఎక్కువైంది. రహదారి మధ్య పాదాచారులు, వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. సమస్య తీవ్రతను ఐటీడీఏ అధికారులు, ఇంజనీర్లు, ప్రజాప్రతినిధులు గిరిజనులు ఫిర్యాదు చేశారు. కానీ, సమస్యకు పరిష్కారం లభించలేదు. పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎప్పుడు ఎవరి ప్రాణం పోతోందోనని.. ప్రమాదకరంగా మారిన రహదారి తామే బాగు చేసుకుంటామని గిరిజనులు చెబుతున్నారు. దీంతో అధికారులకు సిగ్గు కలుగుతుందేమోనని గిరిజన నాయకులు పేర్కొంటున్నారు. ఇటువంటి ప్రమాదాలకు కారణమైన సమస్యలను సకాలంలో పరిష్కరించాలని గిరిజనులు కోరుతున్నారు.



## ఇంటి పన్నులపై స్పెషల్ డ్రైవ్

### -బకాయిల వసూళ్లకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు



**నరసన్నపేట, మార్చి 3(వార్త):** నరసన్నపేట మేజర్ పంచాయతీలో పేరుకు పోయిన ఇంటి పన్నుల బకాయిలను వసూలు చేసేందుకు అధికారులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. మంగళవారం భారీగా బకాయిలు ఉన్న దుకాణాలు, గృహాలను స్వయంగా సందర్శించి వసూళ్ల ప్రక్రియను వేగవంతం చేశారు. పంచాయతీ పరిధిలో మొత్తం రూ. 2.30 కోట్ల ఇంటి పన్నులు రావలసి ఉండగా, ఇప్పటివరకు కేవలం రూ. 1.70 కోట్లు మాత్రమే వసూలైనట్లు అధికారులు వెల్లడించారు. మిగిలిన బకాయిలను తక్షణమే వసూలు చేయడానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పన్నులు చెల్లించని గృహ యజమానులు, వ్యాపారులు స్వచ్ఛందంగా బకాయిలు చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని అధికారులు కోరుతున్నారు. పన్నుల ద్వారా వచ్చే ఆదాయంతోనే మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణ, ప్రజా సేవలు మెరుగుపడతాయని వారు వివరించారు.

## కంపు భరించలేకపోతున్నాం..!

### -నరసన్నపేట మేజర్ పంచాయతీ మార్కెట్ సమీపంలో చెత్త కుప్పలపై స్థానికుల ఆవేదన




**నరసన్నపేట, మార్చి 3(వార్త):** నరసన్నపేట మేజర్ పంచాయతీ పరిధిలోని మార్కెట్ దరి గొడగల వీధి వద్ద సంవత్సరాలుగా చెత్త నిలువలు పేరుకుపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు గ్రామపంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ సమస్యపై స్పందన లేకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చెత్త కుప్పల నుంచి వస్తున్న దుర్వాసన భరించలేనిదిగా మారిందని, ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు అనారోగ్యానికి గురవుతున్నారని నివాసితులు తెలిపారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించి చెత్తను తొలగించి, శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించకూడదని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే చర్యలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

## నిరుపయోగంగా బస్ షెల్టర్

### -బస్సు రాకపోవడంతో గ్రామస్తులకు ప్రయోజనం లేకుండా నిలిచిన నిర్మాణం

**సారవకోట, మార్చి 3(వార్త):** తొగిరిలో నిర్మించిన బస్ షెల్టర్ ప్రస్తుతం నిరూపయోగంగా మారింది. వడ్డినవలస నుంచి బుడితి వెళ్లే మార్గంలో కొన్నేళ్ల క్రితం బస్సు సర్వీస్ నడిచే సమయంలో ప్రయాణికులు నిరీక్షించేందుకు ఈ షెల్టర్ నిర్మించారు. అయితే ప్రస్తుతం ఆ మార్గంలో బస్సు సర్వీస్ నిలిచిపోవడంతో షెల్టర్ ఉపయోగం లేకుండా ఖాళీగా ఉంది. ప్రయాణికులు లేకపోవడంతో స్థానికులు దానిని కర్రలు, ద్విచక్ర వాహనాలు భద్రపరచుకునే స్థలంగా ఉపయోగిస్తున్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ, బస్సు సర్వీస్ పునరుద్ధరించాలా లేదా షెల్టర్‌ను ఇతర ప్రజా అవసరాలకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు. ప్రజల సౌకర్యార్థం నిర్మించిన ఈ బస్ షెల్టర్ ప్రస్తుతం నిర్లక్ష్యానికి గురవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# పెద్దపేట జంక్షన్‌లో ఆర్టీసీ బస్సు-బైక్ ఢీ

**-ఇద్దరు యువకులకు గాయాలు.. రిమ్స్‌కు తరలింపు**

**నరసన్నపేట, మార్చి 3(వార్త):** నరసన్నపేట పెద్దపేట జంక్షన్ వద్ద మంగళవారం సాయంత్రం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఆర్టీసీ బస్సు మరియు ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఇద్దరు యువకులు గాయపడ్డారు. క్షతగాత్రులు జలుమూరు మండలానికి చెందిన రాంజీ, భాస్కరరావుగా గుర్తించారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి వారిని రాజీవ్ గాంధీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ శ్రీకాకుళం (రిమ్స్) ఆసుపత్రికి తరలించారు. శ్రీకాకుళం నుంచి ఇచ్ఛాపురం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు పెద్దపేట జంక్షన్ వద్ద బైక్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.



# ఉపాధి హామీని యథాతథంగా అమలు చేయాలి

**-ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు**

**వంకల మాధవరావు డిమాండ్**

**మెళియాపుట్టి, మార్చి 3(వార్త):** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పాత పద్ధతిలో యథాతథంగా అమలు చేయాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వంకల మాధవరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు సవర సొరయ్య, లక్ష్మణరావు, సవర బంగ్లా కుమార్, భాస్కర రావు, అరుణోదయ సంస్కృతి సమైక్య జిల్లా కార్యదర్శి సోమేశ్వరరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మంగళవారం మెళియాపుట్టిలో జరిగిన సమావేశంలో వంకల మాధవరావు మాట్లాడుతూ మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి చట్టాన్ని వికసిత్ భారత్ గ్యారంటీ ఆఫ్ రోజ్ గార్.. అజీవిక మిషన్ గ్రామీణ్ (వి.బి.జి – రాంజీ) గా పేరు మార్పు చేసి, ఈ చట్టాన్ని మరింతగా నీరుగార్చే కొన్ని సవరణలతో కేంద్ర ప్రభుత్వం డిసెంబర్ 16న పార్లమెంట్ ఉభయసభలలో బిల్లు ప్రవేశ పెట్టిందని ధ్వజమెత్తారు. ఈ బిల్లుపై సభలో చర్చకు అవకాశం ఇవ్వకుండానే విపక్షాల అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోకుండానే ఆగమేఘాల మీద డిసెంబర్ 18వ తేదీ నాటికి చట్ట రూపంలో తీసుకొచ్చారని ఆరోపించారు. గతంలో ఉన్న ఉపాధి హామీ చట్టం ఉపాధి అవకాశాలు కల్పించడంలో లోటుపాట్లు, నిండా అవినీతిలో కూరుకుపోయినప్పటికీ దేశంలో గ్రామీణ, ఆదివాసి ప్రాంతాల ప్రజానీకానికి ఏదో మేరకు ఉపశమనంగా పనిచేస్తున్న ఈ పథకాన్ని సైతం కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం మరింతగా నీరుగారుస్తోంద న్నారు. ఉపాధి హామీ పథకంలో చెల్లించాల్సిన వేతనాలను ఇప్పటివరకు 90% కేంద్రం 10% ఆయా రాష్ట్రాలు భరిస్తుండగా ప్రస్తుత చట్టంలో 60% ఖర్చు మాత్రమే కేంద్ర భరిస్తామంటూ రాష్ట్రాల పై మరింత భారాన్ని ఈ నూతన సవరణ చట్టం మోపుతున్నదని, అంతేకాక రాష్ట్రాలు తాము నిర్ణయించుకున్న పనులను ఉపాధి హామీ పథకం ద్వారా చేయడానికి ఉండే అవకాశాన్ని కూడా కేంద్రం ఈ చట్టం ద్వారా గుంజివేసుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాలపై పెత్తనం చెలాయించదల్చుకున్న వ్యవసాయ సీజన్లో కూలీలకు చేతినిండా పనులు లభ్యం కానీ పరిస్థితులున్నాయని, అంతే కాకుండా వ్యవసాయ సీజన్లో రెండు నెలల పాటు ఉపాధి హామీ పనులు నిలిపి వేయాలని, ఈ నూతన ఉపాధి హామీ చట్టంలో ఉందని, దేశవ్యాప్తంగా ఉపాధి కూలీలకు రావాల్సిన వేల కోట్ల బకాయిలో ఇంతవరకు పూర్తిస్థాయిలో చెల్లించలేదని, ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేయాలనే ప్రయత్నాన్ని తక్షణమే నిలిపివేయాలని, గత ఉపాధి హామీ చట్టాన్ని



మెరుగుపరిచి ఉపాధి పొందడాన్ని హక్కుగా గుర్తించాలని, పని దినాలు 100 నుంచి 200కు పెంచాలని, రోజు కూలీ 700 రూపాయలు ఇవ్వాలని, పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

## కొత్త పింఛన్లు ఎప్పుడిస్తారు?



**సరుబుజ్జిలి, మార్చి 3(వార్త):** అర్హులకు కొత్త పింఛన్ల ఇస్తామని హామీ ఇచ్చి విస్మరించింది. బూటకపు హామీలతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని సరుబుజ్జిలి వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బెవర మల్లేశ్వరరావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకివచ్చి 20 నెలలు గడుస్తున్నా ఇంకా కొత్త పింఛన్లు మంజూరు చేయకపోవడంతో అర్హులకు ఎదురు చూపులు తప్పడం లేదన్నారు. గతేడాది అక్టోబర్ 1వ తేదీనుంచి కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. కానీ ఇంతవరకు ఒక్క పింఛన్ కూడా ఇవ్వ లేదన్నారు. కనీసం దరఖాస్తు చేసు కోవడానికి వెబ్‌సైట్ కూడా తెరవలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మండ లాల్లో అర్హులైన లబ్ధిదారులు మండి పడుతున్నారన్నారు. అర్హులైన వితంతువులు, దివ్యాంగులు, వృద్ధులు కొత్త పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారని వాపోయారు. కూటమి ప్రభుత్వం పింఛన్ మంజూరుపై ఎలాంటి నిర్ణయంతీసుకోకపోవడంతో గత ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్న వారికి కూడా ఇబ్బందులు తప్పడం లేదన్నారు. గ్రామసచివాలయముదరఖాస్తు చేసుకునేందుకసచివాలయాలకురోజూ పదుల సంఖ్యలో లబ్ధిదారులు వెళ్తున్నా రన్నారు. ప్రభుత్వం వెబ్సైట్ తెరవకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారని తెలిపారు. ప్రభుత్వం నుంచి సమాచారం లేదని సచివాలయ సిబ్బంది చెబుతున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో పక్కాగా పింఛన్లు అందించేవారని తెలిపారు. రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా సచివాలయాల్లో దరఖాస్తు ఇస్తే పింఛన్లు మంజూరయ్యేవని, ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగిందని గుర్తు చేశారు. కానీ నేడు ఆ పరిస్థితి లేకుండా పోయిందని వాపోయారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం పింఛన్ల విషయంలో తన వైఖరిని మార్చుకోని, అర్హులుకు పింఛన్లు నూతనంగా మంజూరు చేయాలని ఆయన కోరారు.

## నిరుద్యోగులకు హామీలు అమలు చేయాలి

**-ఖాళీ ప్రభుత్వ ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలి**

**-మొజ్జాడ యుగంధర్**




**నరసన్నపేట, మార్చి 3(వార్త):** నిరుద్యోగ యువతకు కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని మొజ్జాడ యుగంధర్ డిమాండ్ చేశారు. నరసన్నపేటలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, యువతను ప్రభుత్వం మోసం చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, ఆలస్యం చేయకుండా సంబంధిత శాఖలు నోటిఫికేషన్లు విడుదల చేసి నియామక ప్రక్రియ ప్రారంభించాలని ఆయన కోరారు. ఉద్యోగాల కోసం సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న అభ్యర్థులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. నిరుద్యోగ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోందని, యువత ఆత్మవిశ్వాసం దెబ్బతినకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వం తన హామీలను నిలబెట్టుకుని నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.



## ఘనంగా త్రినాథస్వామి ఆలయ 69వ వార్షికోత్సవం

**-బలప్రదర్శన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేసిన బగ్గు అర్చన**

**సారవకోట, మార్చి 3(వార్త):** వడ్డినవలసలో త్రినాథస్వామివారి 69వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించబడింది. గ్రామస్థుల ఆహ్వానం మేరకు నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన కార్యక్రమానికి హాజరై స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. అనంతరం ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన బల ప్రదర్శన పోటీలు, బంపర్ పోటీలు, సంగిడివ పోటీలు, గుండి పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ఆమె బహుమతులు అందజేశారు. గ్రామీణ క్రీడలకు ప్రోత్సాహం ఇవ్వడం ఆనందంగా ఉందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సారవకోట మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు చిన్నాల కూర్మినాయుడు, జలుమూరు జడ్పిటిసి ప్రతినిధి మెండ రాంబాబు, పోలాకి పిఎసిఎస్ ఛైర్మన్ భైరి భాస్కరరావు, వైస్ ఎంపీపీ ఎస్. మురళీధర్, ఎంపీటీ సభ్యులు దాము ఆదినారాయణ, మాజీ ఎంపీటీసీ ఇప్పిలి చంద్రశేఖర్, గ్రామ తెలుగుదేశం నాయకులు మరియు ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, క్రీడాకారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తి శ్రద్ధలతో జరిగిన ఈ వార్షికోత్సవం గ్రామంలో ఉత్సాహాన్ని నింపింది.



## ఆనందంగా.. సురక్షితంగా హోలీ

**-ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి**

**పోలాకి, మార్చి 3(వార్త):** రంగుల పండుగ హోలీ సందర్భంగా నరసన్నపేట నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. హోలీ పండుగ ఆనందం, ఐక్యత, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. పోలాకి మండలం కత్తిరివానిపేట క్యాంప్ కార్యాలయంలో మాట్లాడిన ఎమ్మెల్యే , హోలీ పండుగ చెడు మీద మంచి సాధించిన విజయానికి సంకేతమని, ఈ పండుగ మన జీవితాల్లో సంతోషం, శాంతి, ఐక్యతను తీసుకువస్తుందని అన్నారు. సమాజంలో భేదాభిప్రాయాలను పక్కనపెట్టి అందరూ కలిసి సంతోషంగా జరుపుకునే గొప్ప పండుగగా హోలీ ప్రత్యేకతను కలిగి ఉందని తెలిపారు. అదేవిధంగా, హోలీ వేడుకల సందర్భంగా ప్రజలు కొన్ని జాగ్రత్తలు పాటించాలని సూచించారు. హానికరమైన రసాయన రంగులకు బదులుగా సహజ రంగులను ఉపయోగించాలని, నీటిని వృథా చేయకుండా పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళల పట్ల గౌరవంగా వ్యవహరించాలని, ఎలాంటి అసౌకర్యం కలగకుండా పండుగను సురక్షితంగా జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు సురక్షితంగా, ఆనందంగా హోలీ పండుగను జరుపుకొని తమ కుటుంబాల్లో సంతోషం, శ్రేయస్సు నింపుకోవాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆకాంక్షించారు.



# జోరుగా మట్టి అక్రమ తవ్వకాలు

**-చెరువులు, కొండలనూ వదలని అక్రమార్కులు**

**- రాజకీయ ప్రోద్బలమే కారణమని ఆరోపణలు**

**నరసన్నపేట, మార్చి 3 (వార్త):** నరసన్నపేట, పోలాకి మండలాల్లో ప్రభుత్వ భూములు, చెరువులు, కొండల్లో అక్రమ మట్టి, కంకర తవ్వకాలు విస్తృతంగా కొనసాగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమార్కులు యథేచ్ఛగా తవ్వకాలు చేపట్టి ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా మట్టిని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని స్థానికులు అంటున్నారు. జమ్ము, సత్యవరం, దూకలపాడు, గొట్టిపల్లి, రెడ్డికపేట, తామరాపల్లి, దేశవానిపేట, బొరిగివలస తదితర గ్రామాల్లో ఈ తవ్వకాలు మరింత ఉద్ధృతంగా సాగుతున్నాయని సమాచారం. సమీప కొండలు, గుట్టలను కూడా తవ్వేసి ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా జమ్ము జంక్షన్ సమీపంలోని పాపయ్య చెరువులో భారీ ఎత్తున మట్టి తవ్వకాలు చేపట్టినట్లు తెలిసింది. చెరువులోని మట్టిని పూర్తిగా తరలించడమే కాకుండా చెరువుగట్టును కూడా దెబ్బతీశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో భవిష్యత్తులో వర్షాకాలంలో నీటి నిల్వ సామర్థ్యం దెబ్బతినే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. నరసన్నపేట పట్టణంలో ఇప్పటికే అనేక చెరువులు అన్యాక్రాంతమయ్యాయని, రాజకీయ ప్రోద్బలంతో చెరువులను స్వంతాలుగా మార్చుకుని అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం మిగిలి ఉన్న చెరువులను కూడా కనుమరుగుచేయడానికి పెద్ద ఎత్తున ప్రయత్నాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమ తవ్వకాలను అరికట్టి, చెరువులు మరియు ప్రభుత్వ భూములను రక్షించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



## తీరప్రాంతాల్లో విద్యుత్ వెలుగులు

**- సీఎస్ఆర్ నిధులతో దీపాల ఏర్పాటు**



**పోలాకి, మార్చి 3(వార్త):** నరసన్నపేట నియోజకవర్గ తీరప్రాంతాల్లో విద్యుత్ వెలుగులు నింపే దిశగా కీలక ముందడుగు పడింది. పార్లమెంట్ సభ్యులు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రతిపాదన మేరకు కూల్ ఇండియా లిమిటెడ్ సంస్థ సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధుల కింద తీరప్రాంతాల్లో ఎలక్ట్రికల్ వీధి దీపాల ఏర్పాటు చేపట్టనున్నట్లు నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన పోలాకి మండలం కత్తిరివానిపేట క్యాంప్ కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు. తీరప్రాంత గ్రామాలు సాయంత్రం తర్వాత చీకటిలో మగ్గిపోతున్న పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు భద్రత, సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ఈ ప్రతిపాదన ముందుకు వచ్చినట్లు తెలిపారు. ముఖ్యంగా మత్స్యకారులు రాత్రివేళల్లో సముద్రానికి వెళ్లే సమయంలో, తిరిగి వచ్చే సమయంలో సరైన వెలుతురు అవసరమని పేర్కొన్నారు. మహిళలు, వృద్ధులు, పిల్లల భద్రత దృష్ట్యా వీధి దీపాలు అత్యంత అవసరమని ఆయన అన్నారు. ఈ ప్రతిపాదనకు సంబంధించి పరిపాలనా ప్రక్రియలను పూర్తి చేసి శాంక్షన్ సాధించడంలో కేంద్ర మంత్రి కీలక పాత్ర పోషించారని వెల్లడించారు. తీరంప్రాంత ప్రజల తరపున కేంద్ర మంత్రివర్యులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. సిఎస్ఆర్ నిధులతో ఏర్పాటు కానున్న విద్యుత్ దీపాల ద్వారా రాత్రివేళల్లో ప్రమాదాలు తగ్గడమే కాకుండా సామాజిక భద్రత మెరుగుపడుతుందని, తీరంప్రాంతాల్లో అభివృద్ధికి ఇది ఒక ముఖ్యమైన అడుగుగా నిలుస్తుందని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను తీసుకువచ్చి నరసన్నపేట నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు.

## టీటీడీ నిధులతో త్వరలో శివాలయ నిర్మాణం



**కంచిలి మార్చి 3(వార్త):** త్వరలో అన్ని అనుమతులు పూర్తిచేసుకుని పెద్ద శ్రీరాంపురంలో వెలసిన శ్రీరామలింగేశ్వర ఆలయాన్ని టీటీడీ నిధులతో పునర్నిర్మిస్తామని టీడీపీ మండల అధ్యక్షుడు, ఆ గ్రామ మాజీ సర్పంచ్ మాదిన రామారావు తెలిపారు. గ్రామ అభివృద్ధి విషయమై మంగళవారం దేవాలయ ప్రాంగణంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆలయ నిర్మాణానికి 80 లక్షల రూపాయలు మంజూరైనట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి పూర్తి అనుమతులు రాగ టెండర్ ప్రక్రియ కూడా త్వరలో పూర్తి కాబోతుందన్నారు. అలాగే గ్రామంలో ఇతర అభివృద్ధి పనులు కూడా ప్రస్తుతం జరుగుతున్నాయన్నారు. త్వరలో పూర్తి చేయించి కొత్త పనులు త్వరలో ప్రారంభించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పరి వెంకటరమణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## బొట్టాడాసింగికి రోడ్డు మంజూరు

**-ఎమ్మెల్యే ఎంజీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్థులు**



**ఎల్ఎన్ పేట, మార్చి 3(వార్త):** ఎల్ఎన్ పేట జంక్షన్ నుంచి బొట్టాడసింగి, మీదుగా సరడాం గ్రామం వరకు రోడ్డు చాలా అధ్వానంగా ఉన్నాయని గత ప్రభుత్వంలో ఈ రోడ్లపై సంబంధిత ప్రజాప్రతినిధులకు అధికారులకు విన్నవించుకున్నప్పటికీ రోడ్లు అభివృద్ధి చేసే దాఖలు కనిపించలేదని స్థానిక ప్రజలు వాపోయారు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు దృష్టికి స్థానిక నాయకులు తీసుకుని వెళ్ళగా బొత్తాడసింగి సరడాం రోడ్డు నకు 1 కోటి 50 లక్షల రూపాయలు మంజూరు చేసామన్నారు. ఇటీవల ఎంజీఆర్ ఎమ్మెల్యే మామిడి గోవిందరావు బొట్టాడసింగి గ్రామానికి విచ్చేసిన సందర్భంలో చిన్నారి అంపిలి మోక్షశ్రీ ఎమ్మెల్యే గోవిందరావు తో మాట్లాడిన విషయం ఏమిటంటే మా రోడ్డు చాలా అధ్వానంగా ఉంది అని గత ప్రభుత్వ పాలకులు పూర్తిగా పట్టించుకోలేదని దీనివలన పాఠశాలలకు కళాశాలకు రోడ్డుపై ప్రయాణించాలంటే చాలా ఇబ్బందులు పడి వెళ్లాల్సి ఉందని తొందరగా మాకు రోడ్డు మంజూరు చేయాలని ఆ చిన్నారి కోరింది.. వెంటనే ఎమ్మెల్యే స్పందిస్తూ వారం రోజుల్లో బొత్తాడసింగి రోడ్డు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు హామీ ఇచ్చిన ప్రకారంగానే నేడు రోడ్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. దీంతో గ్రామస్తులంతా సోమవారం ఎమ్మెల్యే గోవిందరావు చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో పాతపట్నం నియోజకవర్గం యువ నాయకులు అంపిలి పోలినాయుడు, నాయకులు లంక బుజ్జి, బోర గోపాల్,లంక మొఖలింగం, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల సేవలో న్యాయ సేవాధికార సంస్థ

**శ్రీకాకుళం, మార్చి 3 (వార్త):** ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు చట్టపరమైన రక్షణతో పాటు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు పేర్కొన్నారు. మంగళవారం ప్రపంచ శ్రవణ దినోత్సవం సందర్భంగా ఆయన స్థానిక బెహరా మనోవికాస్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వినికిడి లోపం ఉన్న చిన్నారులకు ఆయన శ్రవణ యంత్రాలను అందజేశారు. అనంతరం వైద్య చికిత్సా విభాగాన్ని ప్రారంభించి, పిల్లలకు అందుతున్న వైద్య సేవలను స్వయంగా పరిశీలించారు. చిన్నారుల ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కేంద్ర నిర్వాహకులకు ఆయన సూచించారు. కేంద్రంలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్న ఆయన, ఏవైనా ఇబ్బందులు ఉంటే వెంటనే న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ, మానసిక ఆరోగ్య సంస్థల సమన్వయంతో చిన్నారులకు అవసరమైన అన్ని రకాల వైద్య చికిత్సలు అందేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. అలాగే, అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కె.అనిత సౌజన్యంతో చిన్నారులకు పండ్లు, బిస్కెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ శివరంజని, ఆడియాలజిస్ట్ డాక్టర్ ఈ. అఖిల రాణి, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



## కళ్లేపల్లిలో మహిళలకు వైద్యసేవలు

**శ్రీకాకుళం, మార్చి 3 (వార్త):**అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాలను పురస్కరించుకొని జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం కళ్లేపల్లి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మహిళా పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ , ఇన్స్పెక్టర్ నారిమణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరానికి సింధూర హాస్పిటల్ డాక్టర్ సింధూర మహిళలకు వైద్యసేవలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్స్పెక్టర్ లావణ్య, పోలీసు సిబ్బంది, స్వచ్ఛంద సేవా ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళా పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. అలాగే శ్రీకాకుళం మహిళా పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. మహిళా పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ, ఇన్స్పెక్టర్ నారిమణి ఆధ్వర్యంలో లైన్స్ క్లబ్ సౌజన్యంతో నిర్వహించిన ఈ రక్త దానం శిబిరానికి శ్రీకాకుళం సబ్‌డివిజన్ అధికారి (డీఎస్పీ) వివేకానంద ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రక్తదానం మహాదానం అని, అవసరమైన సమయంలో ఒక యూనిట్ రక్తం ఒకరి ప్రాణాన్ని కాపాడగలదని పేర్కొన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు.మహిళా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా మరిన్ని అవగాహన, వ్యాస రచనలు, మహిళ భద్రత, సాధికారత పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్-ఇన్స్పెక్టర్లు చంద్రకళ, లావణ్య, వన్ స్టాప్ సెంటర్ పారామెడికల్ స్టాఫ్ స్రవంతి, ఎస్-ఎస్ జ్యూలర్స్ యాజమాన్యం మరియు సిబ్బంది, స్వచ్ఛంద సేవా ప్రతినిధులు, మహిళా పోలీస్ సిబ్బంది పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో నటుకుల మోహన్ రావు, ఇతర ప్రతినిధులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## వైభవంగా ముగిసిన..
# రట్టి వల్లభుని డోలోత్సవాలు

-ఘనంగా కామ దహనం, కోలసేవ
- మంగళవారం సాయంత్రం జరిగాల్సిన ఉత్సవాలకు గ్రహణం ఆటంకం





**మందస, మార్చి 3(వార్త):** ఉద్దానం భక్తులతో కళకళలాడింది. ప్రతీ ఏడాది సంప్రదాయబద్ధంగా జరిగే రట్టి వల్లభనారాయణుని యాత్రకు భక్తులు పోటెత్తారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఒడిశా నుంచి కూడా భక్తులు డోలోత్సవానికి వచ్చారు. భేతాళపురం పంచాయతీలో గల రట్టి గ్రామంలోని శ్రీవల్లభనారాయణుడు ఉద్దాన ప్రాంత ఆరాధ్యదైవం. మందస సంస్థానాన్ని పరిపాలించిన రాజులు సుమారు 250 సంవత్సరాల క్రితం ఈ ఆలయం నిర్మించగా, అప్పటి నుంచి ఆలయంలో ప్రతీ ఏటా ఐదు రోజుల పాటు జాతర జరుగుతుంది. చివరి మూడు రోజులు యాత్ర భారీగా జరుగుతుంది. ఫిబ్రవరి 26నుంచి స్వామి వారి డోలోత్సవం ప్రారంభం కాగా, చివరి మూడు రోజుల పాటు భారీ ఎత్తున యాత్ర జరుగుతుంది. డోలోపౌర్ణమి సందర్భంగా శ్రీవల్లభనారాయణ స్వామిని దూర తీరాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రముఖులకు ఆలయ సాంప్రదాయాలతో గౌరవించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా మందస పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రహణం కారణంగా మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం వరకు ఆలయ తలుపులు మూసి వేశారు. అనంతరం ఆలయ శుద్ధి జరిపారు. సంప్రదాయంగా వస్తున్న సముద్ర స్నానాన్ని భక్తులు చేశారు. రట్టి బీచ్ వద్ద మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు, బారువా మెరైన్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రహణం కారణంగా రాత్రి ఆలస్యంగా స్వామి కోలసేవను ఎప్పటి నుంచో వస్తున్న సంప్రదాయానుసారంగా నిర్వహించారు. కోల పలికించిన తరువాత స్వామికి పూజలు చేశారు. అనంతరం డోలోత్సవాలు ముగిసినట్టు అర్చకులు చెప్పారు. ఆధ్యాత్మిక, సాంస్క తిక కార్యక్రమాలు నిర్వహించారు.





Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546